క్లుప్తంగా

పోలీసులకు పశువుల తంటా..!



కాటారం: ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల మేడిగడ్డ పర్యటనలో భాగంగా కాన్వాయ్‌కి రోడ్డుపై అడ్డుగా రాకుండా ప్రజలను కట్టడి చేయడం పోలీసులకు సులువైనప్పటికీ రోడ్డుపైకి వచ్చిన పశువులను అడ్డుకోవడానికి తంటాలు పడాల్సి వచ్చింది. కాటారం మండల కేంద్రానికి ఇంకో కొన్ని నిమిషాల్లో ముఖ్యమంత్రి కాన్వాయ్ చేరుకోబోతుండగా అకస్మాత్తుగా పశువులు రోడ్డుపైకి అడ్డుగా వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు వాటిని పక్కకు పంపించడానికి నానా అవస్థలు పడ్డారు. సీఐలు, ఎస్సైలు, సిబ్బంది రోడ్డుపై వాటి వెంట పరిగెత్తుకుంటూ వెళ్లి చివరకు దూరంగా పంపించేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని కొమురంభీం స్టేడియంలో రాష్ట్ర స్థాయి కరాటే లెవల్ చాంపియన్ పోటీలను ఈ నెల 11న నిర్వహించారు. ఈ పోటీల్లో మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు స్పెషల్ ఆఫీసర్ మడె అరుణ తెలిపారు. 21 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, 11 మంది కాంస్యం పతకాలను సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మెడల్స్, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఎట్టి స్వరూప, కోచ్ అబ్బు మాస్టర్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలని వినతి



మంగపేట: మండల కేంద్రంలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ జ్వాలా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆలేటి సుదర్శన్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు, బ్యాంకులకు వివిధ రకాల పనులపై వచ్చే వారు మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రధానంగా మహిళలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని వారి ఆత్మగౌరవానికి భంగం కలుగుతుందన్నారు. విషయంపై తక్షణమే స్పందించి సమస్యను సంబంధిత జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. ఆయన వెంట ట్రస్టు సభ్యులు రాకేష్, ఈక రాజేష్, రోహిత్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని పస్రా నాగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు పన్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ప్రధానోపాధ్యాయులుగా కర్ర సాయి శరణ్య, మండల విద్యాశాఖ అధికారిగా కేస రష్మిత, జిల్లా విద్యాశాఖాధికారిగా పర్వతాల నూతన కుమార్, ఎంఎంఓగా అలేఖ్య, ఉపాధ్యాయులుగా కృష్ణ స్వామి జాన్సన్, గంగుమల్ల వెంకట మనోహర్, ముంద్రాతి హర్షిత, ఇంజపూరి తేజ శ్రీ, మహ్మద్ సందీప్, కొత్త ప్రీతి రెడ్డి, సంకీర్తన, సోలిపురం సహశ్రీక, మహ్మద్ కన్న, ముప్పు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా... డ్రైవర్‌కు గాయాలు



ఎస్ఎస్ తాడ్వాయి: టిప్పర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మంగళవారం ఊరట్టంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జాతరలో భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఊరట్టంలో ఏర్పాటు చేసిన ఓ పార్కింగ్ స్థలంలో చదును కోసం టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. మోరీలపై నుంచి పార్కింగ్ స్థలానికి వెళ్లే క్రమంలో టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో టిప్పర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, వైద్య చికిత్స కోసం అతడిని ఆస్పత్రి తరలించారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



మాట్లాడుతున్న పోలం రాజేందర్

పలిమెల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఐఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పోలం రాజేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని బోదాయిగూడెంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సూదుల శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేందర్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ సందర్శనకు వస్తున్న నేపథ్యంలో ఉదయం 6 గంటలకే పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బందు సాయిల్‌ని జిల్లా కేంద్రంలో ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయడానికి వంద రోజుల గడువు అడిగిందని తెలిపారు. ఆ గడువు పూర్తి కావాలనే మేం వేచి చూస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకపోయినా, ప్రజలకు పిలుపు ఇవ్వకపోయినా అక్రమంగా అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ది పోచయ్య, పెద్ది బాపు, కాపుల సంతోష్, కొవ్వూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ సందర్శనకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం వచ్చిన సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. మంగళవారం తెల్లవారు జామున అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పర్యటన అనంతరం విడుదల చేసి ఇంటికి పంపించారు.

కాటారం: ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల మేడిగడ్డ పర్యటన సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బందు సాయిలును అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని ఆ పార్టీ మండల కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లు వంద రోజుల్లో హామీలు నెరవేర్చాలని లేకుంటే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. అలాగే మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, ఎస్ఎఫ్ఐ సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మంగళవారం తెల్లవారుజామున నాయకులను ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న

ఏటూరునాగారం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ చిన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..ఆధునిక ప్రపంచంలో మహిళలు అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం అనేక చట్టాలలో మార్పు తీసుకురావాలని, ప్రతి మహిళ పురుషులతో సమానంగా ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందుకు సాగాలని కోరారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు అనేక కారణాలతో అభివృద్ధి చెందలేకపోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవీందర్, డాక్టర్ ఎం ఘన సింగ్, డాక్టర్ యు స్వామి, డాక్టర్ బి రేణుక, సిహెచ్ వెంకటయ్య, ఫాతిమా, జ్యోతి, విద్యార్థులు చేశారు.

లక్నవరం సరస్సు వద్ద క్లీన్ అండ్ గ్రీన్



చెత్తను తొలగిస్తున్న ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది

గోవిందరావుపేట: అటవీశాఖ ఆధ్వర్యంలో లక్నవరం సరస్సు వద్ద మేడారం జాతరలో ముందస్తుగా జిల్లా అటవీశాఖ అధికారి ఎస్ జోగేందర్ ఆదేశానుసారం క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా ప్లాస్టిక్, చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ములుగు ఎఫ్‌ఓఎస్ జోగేందర్ మాట్లాడుతూ.. లక్నవరం సరస్సును ప్లాస్టిక్ ఫ్రీ చేయాలి అని అన్నారు. ఇందుకు ఇక్కడ పని చేసే సిబ్బందితో పాటు ప్రజల సహకారం చాలా అవసరం అని అన్నారు. పస్రా ఎఫ్ఆర్ఓ మాధవి శిథల్, డిప్యూటీ ఆర్ఓ శోభన్, ఎఫ్ఎస్ఓ వేణు గోపాల్, సుజాత, ఎఫ్‌బీఓ దీప్ లాల్, అర్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ చరిత్రను పుస్తకాల్లో చేర్చాలి



మాట్లాడుతున్న అంబాల అనిల్

చిట్యాల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను విద్యార్థులు చదువుకునేలా పాఠ్యపుస్తకాల్లో ప్రింటింగ్ చేయాలని విముక్త చిరుతల పార్టీ (వీసీకే) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి నాయకులు గుర్రం సాయి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబాల అనిల్ కుమార్ హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ దేశంలోని అన్ని కులమతాలకు అనుగుణంగా చదువుకునే హక్కులు కల్పించారని అన్నారు. ఆ మహనీయుడి జీవిత చరిత్రను ప్రతి విద్యార్థి చదువుకునేలా పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నితిన్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ ట్రాక్టర్ అప్పగింత



జీపీకి ట్రాక్టర్‌ను తీసుకువస్తున్న సిబ్బంది

మల్హర్: మండలంలోని చిన్నతూండ్ల గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులో అధికారులు జాప్యం చేస్తున్నారనే ఉద్దేశ్యంతో జీపీ ట్రాక్టర్‌ను మాజీ సర్పంచ్ మమత నర్సయ్య స్వాధీనం చేసుకున్నారు. కాగా ఎంపీఓ విక్రమ్‌కుమార్ హామీతో మంగళవారం ట్రాక్టర్‌ను మాజీ సర్పంచ్ గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా డీఎస్‌కే(డిజిటల్ సిగ్నేచర్ కీ) ప్రక్రియ పూర్తిగా కానే రెండు, మూడు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లు చెల్లిస్తామని ఎంపీఓ స్పష్టమైన హామీ ఇచ్చారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వెంకటాపురం(కె): ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరుతూ మనం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కస్తూరిబాగాంధీ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు కలిసి మండల కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మనం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు చౌలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని అన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించి కాలుష్యాన్ని నియంత్రించాలని అన్నారు. కాలుష్య నియంత్రణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, ప్రమీల, రాజ్యలక్ష్మి, శిరీష తదితరులు ఉన్నారు.

సమ్మెకు అనుమతి ఇవ్వాలి



తిరుపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: దేశ వ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించే సమ్మెలో మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ జీడి తిరుపతికి మంగళవారం యూనియన్ నాయకులు కట్కూరి నరేందర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిా ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు సమ్మె నిర్వహించడం జరుగుతుందన్నారు. ఔట్‌సోర్సింగ్, శానిటేషన్ సిబ్బందికి గత మూడు నెలల నుంచి సక్రమంగా జీతాలు రావడం లేదని అన్నారు. నెలల తరబడి ఈపీఎఫ్, ఈఎస్ఐ ఏజెన్సీ కట్టడం లేదన్నారు. సమ్మెలో పాల్గొని మన సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంకం కిషోర్, బిట్ల రమణ, సిబ్బంది గురుకుంట్ల కిరణ్, కె.రాజేష్, పుల్ల సతీష్, పాల శంకర్, ఆరెపల్లి శశి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

గోవిందరావుపేట: తప్పిపోయిన వ్యక్తిని వారి కుటుంబ సభ్యులకు పస్రా పోలీసులు మంగళవారం అప్పగించారు. ఈ సందర్భంగా పస్రా ఎస్సై షేక్ మస్తాన్ మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం వరంగల్‌కి చెందిన బరిగెల శ్రీనివాస్ మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లి పోయారు. పస్రా గ్రామంలో అనుమానస్పదంగా కనిపించటంతో వివరాలు సేకరించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పజెప్పటం జరిగిందని అన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గోవిందరావుపేట: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ గుజరాత్ వారి ఆధ్వర్యంలో గుజరాత్ యూనివర్సిటీ అహ్మదాబాద్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు 19 జాతీయ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం చల్వాయికి చెందిన విద్యార్థినులు అల్లం స్వాతి 8వ తరగతి హై జంప్‌లో, మడి అనూష 7వ తరగతి లాంగ్ జంప్ లో జిల్లా నుంచి ఎంపికైనారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ప్రత్యేక అధికారి ఎం.వెంకటలక్ష్మి అభినందించారు. జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పగడాల వెంకటేశ్వర్ రెడ్డి, పాఠశాల పీఈటీ నాగమణి, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచి గెలుపొందాలని ఆకాంక్షించారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



సమ్మేళనంలో అభివాదం చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: హక్కులు, చట్టాల సాధన కోసం ఆదివాసీలు ఐక్యతగా ఉద్యమించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మేడారంలోని సమ్మక్క భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఆదివాసీ తప్పకుండా పాటించాలన్నారు. కలిసి కట్టుగా పోరాటాలు చేయాలని పోరాటాల ద్వారా మాత్రమే హక్కుల్ని కాపాడుకోగలుగుతామని తెలిపారు. పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందని, ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ హక్కులకు భంగం కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న ప్రతి ఆదివాసీలకు హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పొలిటికల్ జాక్ జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్య దొర గారు మాట్లాడుతూ.. ఆదివాసీలు రాజ్యాధికారం లక్ష్యంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ ఆదివాసీ తెగలలో ఉన్న ఆదిమ సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగు కాకుండా ప్రభుత్వాలు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సమ్మేళనంలో ఆదివాసీ వక్తలు, నాయకులు పలు తీర్మానాలను చేశారు. గిరిజన సలహా మండలి ఆరు నెలలకోసారి షెడ్యూల్ ప్రాంత ప్రజల సమస్యలపై సమీక్ష చేసి వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి పలు సమస్యలపై తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, జాతీయ కో కన్వీనర్ పోడెం రత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చింత కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, గిరిజన అభ్యుదయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందా సంతోష్‌కుమార్, పాయం సత్యనారాయణ జీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమరం ప్రభాకర్, కబ్బాక శ్రావణ్ కుమార్, ఉద్యోగ సంఘ రాష్ట్ర నాయకులు పోదెం కృష్ణ ప్రసాద్, చేరుకుల ధర్మయ్య, చేల సత్యం, జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్, కార్యదర్శి చందా మహేష్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి నిర్వహించాలి

ములుగు రూరల్: ఈ నెల 15న సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగావేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య జంపన్న ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించాలని అన్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాలకు ప్రభుత్వం నిధులు కేటాయించి జయంతి వేడుకలు నిర్వహించాలని అన్నారు. లంబాడీల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో బోగ్ బండారో నిర్వహించాలని అన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

కాటారం: రాష్ట్రంలోని భాషా పండితులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని రాష్ట్ర వేతన సవరణ కమిటీ(పీఆర్‌సీ) చైర్మన్‌ను పండిత పరిషత్ మండల అధ్యక్షుడు ఆలోత్ ప్రతాప్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు చైర్మన్‌కు వినతిపత్రం పంపించినట్లు ప్రతాప్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న తెలుగు, హిందీ, ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రమ దోపిడికి గురవుతున్నారని ఆరోపించారు. వెట్టి చాకిరి చేస్తూ మూడు దశాబ్దాలుగా సమాన హోదా, సమాన పనికి సమాన వేతనం కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు 20 సంవత్సరాలుగా ఒకే కేడర్‌లో పని చేస్తూ పదోన్నతికి నోచుకోలేక పోతున్నారన్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రవళి పాదయాత్ర ప్రారంభం



రవళి పాదయాత్రను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, సీతక్క మంత్రి కావాలని గట్టమ్మ ఆలయంలో మొక్కుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రవళి మంగళవారం గట్టమ్మ ఆలయం నుంచి మేడారం వరకు పాదయాత్ర చేపట్టగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రారంభించారు. ఈ మేరకు ఆమె ముందుగా గట్టమ్మ తల్లికి చీరె సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పాదయాత్రకు స్వాగతం



గోవిందరావుపేట: రవళికి స్వాగతం పలుకుతున్న మహిళా నాయకురాళ్లు

గోవిందరావుపేట: గట్టమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన కాలినడక మండల కేంద్రంలోని మచ్చపూర్ గ్రామం వద్దకు చేరేకుంది. కూచన రవళికి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రేగ కళ్యాణి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళ అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, మహిళ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు సునీత, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చొప్పదండి వసంత, ఎంపీటీసీ చాపల ఉమాదేవి, సామ శ్రీలత, తోకల అహల్య, గోపిదాసు వజ్రమ్మ పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి



మొక్కులు చెల్లించుకుంటున్న మంత్రి సీతక్క



మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

మంత్రి సీతక్క

ములుగు రూరల్: మేడారం మహాజాతరకు వచ్చే భక్తులు గట్టమ్మ తల్లికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ అని భక్తులకు గట్టమ్మ ఆలయం వద్ద అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మంగళవారం గట్టమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి గట్టమ్మ ఆలయ పరిసరాల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరిష్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్ పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మంగళవారం మండలంలోని జగ్గన్నపేటలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ.. చిన్నారులకు మొదటి అక్షరభ్యాసం అంగన్‌వాడీ కేంద్రాల్లో మొదలవుతుందని అన్నారు. అనంతర జగ్గన్నపేట సమీపంలో కొలువైన పుట్ట మల్లన్న స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ మోటర్ ప్రారంభించారు. ఐసీడీఎస్, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆదివాసీలతో కమిటీ ఏర్పాటు చేయాలి

మంగపేట: మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ఉత్సవ కమిటీని ఆదివాసీ గిరిజనులతో ఏర్పాటు చేయాలని ఆదివాసీ సేన ములుగు డివిజన్ అధ్యక్షుడు ఆదినారాయణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీ ఆరాధ్య దైవాలయిన సమ్మక్క–సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న, నాగులమ్మ మహాజాతర పూర్తి ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో జరుగుతుందన్నారు. జాతరకు పూర్తి స్థాయి జాతర ట్రస్టు బోర్డు కమిటీని ఏర్పాటు చేయకుండా తాత్కాలిక జాతర ఉత్సవ కమిటీ పేరుతో కమిటీలో గిరిజనేతరులను కమిటీ సభ్యులుగా నియమించడం ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు విద్దమని ఖండించారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు మేడారం జాతర ట్రస్టుబోర్డును రాజకీయ కోణంలో చూస్తున్నారే తప్ప ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా పూర్తిస్థాయి ట్రస్టు బోర్డును నియమించకుండా ఆదివాసీ గిరిజన సాంప్రదాయాలను విస్మరిస్తున్నారని విమర్శించారు.